01ATP27F_01ATP27F.qxd 27-01-2026 PM 11:12 Page 1






అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

బుధవారం 28 జనవరి 2026 పేజీలు : 04


# పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పనులను వెంటనే పూర్తి చేయండి

- కొత్త పనులు త్వరగా ప్రారంభం కావాలి.. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం
- 3మండలాల అధికారులతో ఎమ్మెల్యే సునీత సమావేశం
- 55 మందికి రూ.23 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే




మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే పరిటాల సునీత

**రాప్తాడు, జనవరి 27, ప్రభాతవార్త**

ఉపాధి హామీ కింద చేపట్టిన పనులు ఎక్కడా పెండింగ్ లో ఉండకూడదని వాటిని వెంటనే పూర్తి చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ఆమె అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ డిఈ, ఏఈలు ఉపాధి హామీ అధికారులు పాల్గొన్నారు. అనంతపురం రూరల్, రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో ఇప్పటివరకు ఎన్ని పనులు జరుగుతున్నాయి. అవి ఎంతవరకు వచ్చాయన్న విషయాల గురించి ఆరా తీశారు. పెండింగ్ లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేసి మస్టర్లు క్లోజ్ చేయాలన్నారు. అలాగే కొత్త పనులు వెంటనే చేపట్టాలని సూచించారు. ఎక్కడా కూలీలకు ఇబ్బంది కలగకూడదని కొత్త పనులు వెంటనే ప్రారంభం కావాలన్నారు. గ్రామాల్లో ఉన్న పరిస్థితుల గురించి కూడా ఎమ్మెల్యే సునీత ఆరా తీశారు.

**సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే సునీత :**

రాప్తాడు నియోజకవర్గంలో పలువురికి ఎమ్మెల్యే పరిటాల సునీత సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. మొత్తం ఆరు మండలాలకు సంబంధించి 55 మందికి గాను 23 లక్షల రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. చెక్కులు అందుకున్న వారు ఎమ్మెల్యే సునీత, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కష్ట సమయాల్లో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారిని సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నట్లు ఎమ్మెల్యే సునీత తెలిపారు. ఇప్పటివరకు గతంలో ఎప్పుడూ లేనివిధంగా సీఎంఆర్‌ఎఫ్, ఎల్వోసీ కింద మొత్తం 7 కోట్ల 75 లక్షల రూపాయలు అందజేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఆరోగ్యం విషయంలో ఎలాంటి సాయం అడిగినా చేస్తున్నారన్నారు. ప్రజలు ఆరోగ్య విషయంలో ఇబ్బంది పడకూడదన్నది ముఖ్యమంత్రి ఉద్దేశం అన్నారు.

# విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కోసం రైతుల ఆందోళన

- అధికారుల స్పందించకపోతే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామన్న రైతులు



విద్యుత్ కార్యాలయం ముందు పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన చేస్తున్న రైతులు

**రాయదుర్గం, జనవరి 27 ప్రభాతవార్త**

రాయదుర్గం పట్టణంలో ఏపీ ట్రాన్స్కో ఆఫీస్ దగ్గర మంగళవారం రాయదుర్గం మండలం బొమ్మకపల్లి మెచ్చిరి గ్రామాలకు చెందిన రైతులు ట్రాన్స్ఫార్మర్ కోసం ఆందోళనకు దిగారు డీడీలు కడ్డీ రెండు సంవత్సరాలైనా ఇంతవరకు ట్రాన్స్ఫార్మర్ ఇవ్వడం లేదంటూ రైతులు సురేష్ ఎల్లప్ప బొమ్మేషు ఆవేదన వ్యక్తం చేశారు మా కన్నా వెనక డీడీలు కట్టిన రైతులు ట్రాన్స్ఫార్మర్ల ఇచ్చారని వారు ఆరోపించారు రాయదుర్గం రూరల్ ప్రాంతంలో రైతులు విద్యుత్ కనెక్షన్ల కోసం చాలా ఇబ్బందులు పడుతున్నారు ఒకొక్క కలెక్షన్ ట్రాన్స్ఫార్మర్ దాదాపు 70 వేల రూపాయలు దాకా వసూలు చేస్తున్నట్లు అనంతరం మెటీరియల్ అంటూ మరో 50 వేలు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు మల్లాపురం గ్రామంలో ఈ మధ్యనే ఇద్దరు రైతులతో 70వేలు కట్టించుకొని అదనంగా మరో 50 వేలు కట్టించుకొని 1. 20 లక్షలు కు ట్రాన్స్ఫార్మర్ స్తంభాలు మెటీరియల్ కలెక్షన్ ఇచ్చినట్లు రైతుల ఆరోపిస్తున్నారు ఏదేమైనా రైతుకు ట్రాన్స్ఫార్మర్ విద్యుత్ కనెక్షన్ కోసం విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతుందని రైతుల ఆరోపిస్తున్నారు.

# ఐదు రోజుల పని దినాల కోసం బ్యాంకు ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన




స్థానిక శ్రీనివాస్ నగర్‌లో ఇండియన్ బ్యాంకు వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు ఉద్యోగ సంఘాల నేతలు సమావేశానికి హాజరైన మీద బ్యాంకుల ఉద్యోగులు, అధికారులు

- అనంత వీధుల్లో వందల సంఖ్యలో నిరసన
- పనిలో ఒత్తిడి గురవుతున్న స్పందించలేదని ఆక్రోశం
- యు.ఎఫ్.బి.యు. పిలుపు మేరకు వివిధ బ్యాంకు ఉద్యోగ సంఘాల నిరసనలు

**అనంతపురం, జనవరి 27 ప్రభాతవార్త బ్యూరో**

బ్యాంకుల్లో పని ఒత్తిడి వల్ల తీవ్ర ఇబ్బందికి గురవుతున్నామని, గతంలో చేసుకున్న ఒప్పందం మేరకు తమకు ఐదు రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ యుఎఫ్‌బియు పిలుపుమేరకు అనంతపురంలో మంగళవారం బ్యాంకు ఉద్యోగులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. వివిధ బ్యాంకు ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో వందలాదిమంది అనంతపురం వీధుల్లో ర్యాలీ నిర్వహించి తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యుటిబియు పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా 8 లక్షల మంది బాయంక్ ఉద్యోగస్తులు సమ్మెలో పాల్గొన్నారు. అనంతపురం జిల్లా యుఎఫ్‌బియు ఆధ్వర్యంలో స్థానిక ఇండియన్ బాయంక్ మైన్‌బ్రాంచ్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ఇండియన్ బ్యాంక్ నుంచి క్లాక్ టవర్ వరకు 500 మంది బ్యాంక్ ఉద్యోగస్తులు ర్యాలీగా వెళ్లి క్లర్క్ వద్ద మానవ హారాన్ని ఏర్పాటు చేసి 25 నిమిషాల పాటు తిరిగి 5 రోజుల పనిదినాల కొరకు నినాదాలు చేశారు. తిరిగి ఇండియన్ బ్యాంక్ వద్దకు చేరుకోవడం జరిగింది. ఇండియన్ బ్యాంక్ వద్ద సభను ఉద్దేశించి బ్యాంకు ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ ప్రెసిడెంట్ కె.శంకర్ మాట్లాడుతూ.. గత 10 సంవత్సరాలు క్రిందట బ్యాంకు యూనియన్లకు ఐబిఏ మధ్య చర్చలలో 5-డే బ్యాంకింగ్ పట్ల ఒప్పందం కుదిరింది. క్లియరెన్స్ కొరకు కేంద్ర ప్రభుత్వానికి, ఆర్‌బిఐకు నివేదించడం జరిగింది. కాని 10 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం బ్యాంక్ ఉద్యోగస్తుల పట్ల వ్యతిరేక దృక్పథంతో నడుస్తోంది అని, తమ వాదనను పట్టించుకోవడం లేదని, రాబోయే రోజుల్లో ఈ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లామని తెలియజేశారు. ఎస్‌బిఐ ఎన్‌సిబిఇ లీడర్ ఖాదర్‌బాషా మాట్లాడుతూ.. ఇప్పుడున్న పరిస్థితుల్లో 5 డే బ్యాంకింగ్ అనివార్యం అని, ఇతర ఫైనాన్షియల్ సెక్టార్ అయిన ఆర్‌బిఐ, ఎస్ఈడిఐ, ఐఆర్‌డిఏ, ఎల్‌ఐసి, జిఐసి, ఎన్‌పిఎస్ ఆర్థిక సంస్థలన్ని 5 రోజులు పని దినాలు కలిగి ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో బ్యాంకింగ్ రంగాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఐబిఓసి, ఎజిఎస్ చంద్రమోహన్ మాట్లాడుతూ.. బ్యాంకులు రైతులకు సాధారణ ప్రజానికానికి ప్రభుత్వ రంగ బ్యాంకులు అనేక రకాల సేవలు అందిస్తున్నాయని, ముఖ్యంగా నోట్ల రద్దు సమయంలో, కరోనా వ్యాప్తి సమయంలో అధికంగా ఉన్న సమయంలో కూడా బ్యాంకు ఉద్యోగస్తులు తమ విధులు నిర్వహించారని తెలియజేశారు. కాని బ్యాంకు ఉద్యోగస్తులనువారి బాధలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. బ్యాంకు ఉద్యోగుల కో-ఆర్డినేషన్ సెక్రెటరీ సంజయ్‌రామ్ మాట్లాడుతూ.. బ్యాంకింగ్ రంగంలో గత పది సంవత్సరాలుగా టెక్నాలజీ చాలా అభివృద్ధి చెందిందని, బ్యాంకుల 5 డేస్ వర్కింగ్ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండదని, ముఖ్యంగా బ్యాంకుల్లో నగదుకు సంబంధించి ఎటిఎం, డిపోసిట్ మిషన్‌లు అందుబాటులో ఉన్నాయని మొబైల్ ద్వారా, పేటిఎం, ఫోన్‌పే, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ మొదలగు సేవలు ద్వారా ప్రజలకు ప్రయోజనాలు కలిగి ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా నుంచి దాదాపు500 మంది బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు. ముఖ్యంగా అధిక ఒత్తిడి కలిగిన స్కేల్-4, స్కేల్-3 ఉద్యోగులు పాల్గొనడం జరిగింది. అదే విధంగా వివిధ బ్యాంకు సంఘాల నాయకులు సునిత, రవితేజ, చంద్రశేఖర్, రేణుక, లోహిత్, నాగేంద్ర, సిఐటియు అరవింద్, చంద్రమౌళి, నవీన్, మురళీ, వహీద్, హనుమేష్, సతీష్, మల్లికార్జున, రమణరాజు, శివారెడ్డి, ఖైమన్ని బేగం, ఖైరునా, మధుబాబు, రవీంద్రనాయక్, పవన్ తదితరులు పాల్గొన్నారు.




అనంతపురంలో భారీ ర్యాలీ చేస్తున్న దృశ్యం




మాట్లాడుతున్న బ్యాంకు ఉద్యోగ సంఘం నాయకులు

# నేటి నుంచి సిడబ్ల్యూసి సభ్యులు రఘువీరారెడ్డి 3 రోజుల పాదయాత్ర

- 78 మందితో నీలకంఠాపురం నుంచ పాదయాత్ర - రాజకీయాలకు అతీతంగా పాదయాత్రకు సన్నాహాలు

**అనంతపురం, జనవరి 27 ప్రభాతవార్త బ్యూరో**

సిడబ్ల్యూసి సభ్యులు, మాజీ మంత్రి నీలకంఠాపురం రఘువీరారెడ్డి బుధవారం నుంచి 3 రోజులపాటు పాదయాత్రకు శ్రీకారం చుడుతున్నారు. గాంధీజీ సందేశాత్మక పాదయాత్ర పేరుతో శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం నీలకంఠాపురం నుంచి చేపట్టేపాదయాత్ర 28, 29, 30 తేదీల్లో కొనసాగుతుంది. పార్టీలకు అతీతంగా జాతీయ జెండాలను చేతపట్టుకుని పాదయాత్ర నిర్వహిస్తారు. జాతిపిత మహాత్మాగాంధీ మరణించి 78 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా 78 మందితో జాతీయ జెండాను చేతబట్టుకు పాదయాత్ర చేపట్టాలని నిర్ణయించారు. దేశాన్ని జాతిపితను వేరు చేసే కుట్ర జరుగుతోందన్న కారణంతో మహాత్మాగాంధీ నామస్మరణ చేస్తూ జాతిపిత ఔనత్యాన్ని చాటి చెప్పడానికే మాజీ మంత్రి రఘువీరారెడ్డి ఈ పాదయాత్రకు శ్రీకారంచుట్టినట్లు తెలుస్తోంది. ప్రపంచంలోని వివిధ దేశాల్లో మహాత్మాగాంధీని స్పూర్తిగా తీసుకుని నేతలు ముందుకు సాగుతున్నారని అయితే ఇప్పుడు మహాత్మాగాంధీ పేరును చిన్న బుచ్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని కొన్ని రాజకీయపార్టీలు కుట్రతో మహాత్మాగాంధీ నామస్మరణను వివాదాస్పదం చేసేందుకు జరుగుతున్న పరిణామాల్లో గాంధీజీ ఫిలాసఫీని చాటి చెప్పేందుకు రఘువీరారెడ్డి పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. మాజీమంత్రి రఘువీరారెడ్డి పెద్దనాన్న శ్రీరామిరెడ్డి స్వాతంత్ర్య సమరయోధుడు. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాల నుంచి వచ్చిన వ్యక్తిగా మాజీ మంత్రి రఘువీరారెడ్డి మరింత బాధ్యతతో పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ పాదయాత్ర రాజకీయ పార్టీలకు అతీతంగా జరుగుతుంది. పాదయాత్రలో ఏ పార్టీకి సంబంధించిన జెండాలు ఉండవు. కేవలం జాతీయ జెండా, మహాత్మా గాంధీ బొమ్మతో ఉన్నటువంటి జెండాలు పట్టుకుని పాదయాత్ర చేస్తారు. జాతిపిత మహాత్మాగాంధీకుల మతాలకు అతీతంగా స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో ప్రధాన భూమిక పోషించారు. ఆయనను అన్ని పార్టీల వారు గౌరవిస్తారు. ఈ నేపథ్యంలో ఈ నెల 28వ తేదిన మడకశిర మండలం నీలకంతాపురంలో ఉదయం 9 గంటలకు పాదయాత్ర ప్రారంభం అవుతుంది. మధ్యాహ్నం 2 గంటలకు మడకశిరలోని సిద్దార్థ స్కూల్ వద్దకు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అదేరోజుసాయంత్రం బుల్లసముద్రం చేరుకుని రాత్రి బస చేస్తారు. 29వ తేదిన ఉదయం 9 గంటలకు బుల్ల సముద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటలకు ధనాపురం క్రాస్ వద్దకు చేరుకుంటుంది. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ధనాపురం క్రాస్ వద్దకు చేరుకుంటుంది. 30వ తేదిన 10 గంటలకు సేవా మందిరం నుంచి ప్రారంభమై హిందూపురంలోని గాంధీచౌక్ వద్దకు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసేబహిరంగ సభలో సిడబ్ల్యూసి సభ్యులు రఘువీరారెడ్డి ప్రసంగిస్తారు. ఈ విధంగా మూడు రోజుల పాటు మహాత్మాగాంధీ సందేశాత్మక ర్యాలీ కొనసాగుతుంది. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ..ఇటీవల నేను నా కుటుంబంతో కలిసి శ్రీలంకలోని శాంకరీదేవి శక్తి పీఠాన్ని, సీతమ్మ వాటికను సందర్శించాను. ఈ సందర్భంగా ట్రికోమలీ పట్టణంలోని ఉన్న మహాత్మాగాంధీ విగ్రహాన్నికూడా దర్శించాను. అక్కడిస్థానిక ప్రజలతో మాట్లాడినప్పుడు గాంధీ జయంతిని తామంతా పండుగలా జరుపుకుంటామనివారు చెప్పిన మాటలువిన్నాక పులకరించింది. అందులేని సంతోషంతోపాటు ఆశ్చర్యమూ కలిగింది. అప్పటి నుంచి ఆ ప్రజలు చెప్పిన మాట మదినిండా మెదులుతూనేఉంది.



**మహాత్మా గాంధీ స్పూర్తితో ప్రభావితమైన కుటుంబం :**

200 ఏళ్ల బ్రిటీష్ వలసపాలనలో బానిసత్వాన్ని అనుభవించిన భారతదేశాన్ని దాస్యశృంఖలాల నుంచి విముక్తం చేసేందుకు ప్రజలందరినీ ఐక్యం చేసిమహోన్నత స్వాతంత్ర్యఒద్యమాన్ని నిర్మించిన మహనీయుడు మహాత్మాగాంధీ.

**.త్యాగ మూర్తి-స్పూర్తి ప్రదాత మహాత్మాగాంధీ :**

ఈరోజుమన దేశంలో మనమంతా స్వేచ్ఛా వాయువులు పీల్చుతూ ప్రజాస్వామ్యాన్నిఅనుభవిస్తున్నామంటే అనేక మంది స్వాతంత్ర్య సమరయోధుల తోపాటు గాంధీ నాయకత్వం కూడా ప్రధాన కారణం.

**గాంధీని అవమానించడమంటే దేశాన్ని అవమానించుకోవడమే:**

స్వాతంత్ర్యోద్యమంలో ఏ మాత్రం ప్రమేయంలేనికొందరు తమసంకుచిత, కుటిల రాజకీయాల కోసం మహాత్మా గాంధీ జీవితంపైన అసత్యాలతో, వక్రీకరణలతో వ్యతిరేక ప్రచారం చేస్తూప్రజలను, నేటి యువతనుతప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తుండటం అత్యంత బాధనుకలిగిస్తోంది.

**గాంధీ సిద్ధాంతాలు భవిష్యత్తుకు మార్గ దర్శకాలు :**

సత్యం, సత్యాగ్రహం, అహింస, మానవత,ప్రేమ,పరమత సహనం, జాతీయ ఐక్యత,సర్వోదయ, స్వదేశీ, అంటరానితనం నిర్మూలన,నైతిక విలువలు,గ్రామస్వరాజ్యం,స్త్రీ పురుష సమానత్వం, భాగస్వామ్య ప్రజాస్వామ్యం తదితర సిద్ధాంత, కార్యాచరణలతో యావత్తు దేశాన్ని మేల్కొలిపి సామాన్యులను అసామాన్యులుగా తీర్చి దిద్దిన మహారుషి గాంధీ.

# కదిరిలో ప్రైవేట్ వైద్యుని నిర్లక్ష్యం.. తల్లి బిడ్డ మృతి




మృతి చెందిన తల్లి బిడ్డ



నిరసన తెలియజేస్తున్న బంధువులు, వామపక్ష పార్టీ నేతలు

- రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేసిన కమ్యునిస్టులు, వామపక్ష పార్టీనేతలు
- డా.మారుతి వరప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**కదిరి, జనవరి 27 ప్రభాతవార్త**

సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని పద్మావతి ప్రైవేట్ వైద్యశాలలో ప్రైవేట్ వైద్యుని నిర్లక్ష్యంతో తల్లి బిడ్డ మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది.

ఇందుకు సంబంధించి బంధువులు తెలిపిన వివరాల మేరకు గత పది రోజులుగా ప్రైవేట్ వైద్యశాలలో నంబులపూలకుంట మండలం జవకల గ్రామానికి చెందిన మహిళ హారిణి పురిటి నొప్పులతో వైద్య శాలలో చేరింది. అయితే డాక్టర్ మహిళపరిస్థితి విషమంగా ఉన్నప్పటికీ బంధువులకు తెలపకుండా వైద్యం చేయడంతో మహిళతోపాటు నవజాత శిశువుమృతి చెందింది. సాధారణ డెలివరీ చేస్తామని(నార్మల్) చెప్పిన వైద్యులు చేతులెత్తేశారని, బంధువులు ఆరోపించారు. డాక్టర్‌నిర్లక్ష్యంతోనే మృతి చెందారని, మహిళబంధువులు సిపిఐ,సీపిఎం నాయకులు పెద్ద ఎత్తున పద్మావతి ఆసుపత్రి ఎదుట అనంతపురం-మదనపల్లి .ఆతీయ రహదారిపై బైటాయించి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిర్లక్ష్యంగా వైద్యం అందించి తల్లి బిడ్డ మృతికి కారణమైన డాక్టర్ మారుతి ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళ బందువులు ఆసుపత్రికి చేరు కోవడంతో డా.మారుతి ప్రసాద్ పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి లొంగి పోయాడు. గతంలోనూ పద్మా వతి వైద్యశాలలో వైద్యుని నిర్లక్ష్యంతో పలువురు మహిళలు, పిల్లలు చనిపోయినప్పటికీ చర్యలు తీసుకోలేదని ప్రజా సంఘాలు విమర్శిస్తు న్నారు. ఇప్పటికైనా పద్మావతి ఆసుపత్రిని సీజ్ చేసి వైద్యుడు మారుతి వరప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# ఏసిబికి చిక్కిన విఆర్ఓ

**హిందూపురం టౌన్ జనవరి 27 ప్రభాతవార్త**

హిందూపురం మండలం కిరికెర సచివాలయం 3లో విధులు నిర్వహిస్తున్న వీఆర్వో హరిత 5000 లంచం తీసుకుంటూ మంగళవారం ఏసీబీకి చిక్కింది. కిరికెరకు గ్రామానికి చెందిన జై చంద్ర అనే వ్యక్తి తన ఇంటికి సంబంధించిన పొజిషన్ సర్టిఫికెట్ కోసం పలుమార్లు వీఆర్వోను సంప్రదించిన ఫలితం లేదు, పొజిషన్ సర్టిఫికెట్ కావాలంటే తనకు 5000 లంచం ఇస్తే పొజిషన్ సర్టిఫికెట్ ఇస్తానని వీఆర్వో హరిత జై చంద్రను డిమాండ్ చేసింది. దీంతో జై చంద్ర అనే వ్యక్తి లంచమిచ్చుకోలేక అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించాడు. వీఆర్వో హరిత పంచాయతీ కార్యాలయం సమీపంలో జై చంద్రా అనే వ్యక్తి నుంచి 5000 లంచం తీసుకుంటుండగా వీఆర్వో హరితను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.



పట్టుబడిన విఆర్ఓ హరి

# ట్రైనీ కలెక్టర్‌కు ఘనంగా ఆహ్వానం పలికిన కమిషనర్

**అనంతపురం జనవరి27 ప్రభాతవార్త**

ట్రైనీ కలెక్టర్ సచిన్ రహర్‌కు నగరపాలక సంస్థ కమిషనర్ బి.బాలస్వామి బుధవారం తన ఛాంబర్‌లో పూలకుండిని అందజేసి ఘనంగా ఆహ్వానం పలికారు. శిక్షణలో భాగంగా ట్రైనీ కలెక్టర్ 15రోజులు పాటు ఆయా శాఖల విధుల నిర్వహణపై శిక్షణ పొందుతారు.

ట్రైనీ కలెక్టర్‌కు పూలకుండి అందజేసి ఆహ్వానం పలుకుతున్న కమిషనర్ బాలస్వామి →



# స్టాండింగ్ కమిటిలో బడ్జెట్‌కు ఆమోదముద్ర

**అనంతపురం జనవరి27 ప్రభాతవార్త**

2026-27కు సంబంధించి నగరపాలకసంస్థ బడ్జెట్‌ను బుధవారం నగర మేయర్ ఛాంబర్‌లో స్టాండింగ్ కమిటి ఆమోదముద్ర వేసింది. మేయర్ మహమ్మద్ వసీం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కమిషనర్ బాలస్వామి, డిప్యూటి కమిషనర్ అంజయ్య, ఎస్ఈ రాజశేఖర్, ఈఈలు షాకీర్, చంద్రశేఖర్, సెక్రటరి సునీత, మేనేజర్ ఖయూమ్, రెవెన్యూ అధికారులు లక్ష్మిదేవి, దేవశంకర్, ఇన్‌చార్జ్ ఆరోగ్య అధికారి బి.ఎల్.నరసింహా,తో పాటు ఆయా విభాగాల కిందిస్థాయి అధికారులు, స్టాండింగ్ కమిటి సభ్యులు పాల్గొన్నారు.



స్టాండింగ్ కమిటి సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వసీం, కమిషనర్, హాజరైన సభ్యులు అధికారులు

02ATP27_02ATP27.qxd 27-01-2026 PM 10:11 Page 1



## యువగళానికి మూడేళ్లు యువనేతా వర్ధిల్లు నూరేళ్లు

### లోకేష్ కు కాలవ అభినందన

**రాయదుర్గం జనవరి 27 ప్రభాతవార్త**

తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సరిగ్గా మూడేళ్ల కిందట చేపట్టిన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకేయ చరిత్రను తిరగరాసిందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కొనియాడారు. యువగళం పాదయాత్ర మూడేళ్ల పూర్తి చేసుకున్న శుభ సందర్భంలో మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో మంగళవారం ఉదయం లోకేష్ బాబుకు కాలవ అభినందనలు తెలిపారు. ఒక అడుగుతో, ఒక్కరు ప్రారంభించిన యువగళం ప్రజాగళమై, ఒక ప్రభంజనాన్ని సృష్టించిందన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అరాచక పాలనను అంతం చేసేందుకు యువనేత పూరించిన సమర శంఖం ఓ అపూర్వ ఘట్టమన్నారు. 2024 ఎన్నికల్లో శత్రువుల కోటను బద్దలు కొట్టించి ప్రత్యర్థికి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కనివ్వకుండా చేసిందన్నారు. కుప్పంలోని శ్రీ వరదరాజ స్వామి పాదాల చెంత ప్రారంభమై 226 రోజుల పాటు 3132 కిలోమీటర్లు కొనసాగడం అద్భుతమన్నారు. కోటిన్నర మంది కష్టసుఖాలు వింటూ, వారిలో ధైర్యం నింపుతూ, సాగిన పాదయాత్రను జగన్ రెడ్డి దుష్టపాలనపై లోకేష్ పూరించిన శంఖారావంగా ఆయన అభివర్ణించారు. అధికారంలోకొచ్చిన తరువాత పాదయాత్రలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న ఘనత లోకేష్ సొంతమన్నారు. ముఖ్యంగా యువతకు ఉద్యోగాల కల్పనలో భాగంగా భారీ పెట్టుబడులను లోకేష్ ఆకర్షిస్తున్న తీరు అందరినీ ఆశ్చర్యపరుస్తోందన్నారు. మాటల్లో ఖచ్చితత్వం, పాలనలో మునుపెన్నడూ చూడని వేగం వెరసి లోకేష్ మార్గం అనితరసాధ్యంగా సాగుతోందని కాలవ ప్రస్తుతించారు. భవిష్యత్తులో మరిన్ని అపురూప విజయాలు ఆయన ఖాతాలో వచ్చి చేరడం ఖాయమన్నారు.

## గుమ్మఘట్ట కానిస్టేబుల్ అనిల్ కుమార్ ఉత్తమ అధికారిగా ప్రశంస..

**గుమ్మఘట్ట జనవరి 27ప్రభాతవార్త**



ఉత్తమ అధికారి ప్రశంసా పత్రం స్వీకరిస్తున్న కానిస్టేబుల్ కె అనిల్ కుమార్

77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కె అనిల్ కుమార్ గుమ్మఘట్ట కానిస్టేబుల్ (3249)కి ఉత్తమ అధికార్తిగా జిల్లా స్థాయి ప్రశంస లభించింది. అనంతపురం జిల్లా కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా ఆయన ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.విధి నిర్వహణలో క్రమశిక్షణ, ప్రజాసేవ పట్ల నిబద్ధత, శాంతి భద్రతల పరిరక్షణలో చూపిన విశేష కృషికి గాను ఈ గౌరవం దక్కినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రూరల్ సీఐ వెంకటరమణ ఎస్సై చిన్న రాయుడు హెడ్ కానిస్టేబుల్ లు రఘుబాబు, ఆంజనేయులు కానిస్టేబుల్స్ అమరేంద్ర, నాగార్జున, గంగాధర్, మధుబాబు,గంగన్న,మల్లికార్జున,నగేష్,బాష పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బందికానిస్టేబుల్ కె.అనిల్‌కుమార్‌ను అభినందించారు.

## ఇంటి స్థలాల కోసం వామపక్షాలు ధర్నా

### స్థలాలు ఇస్తారు మౌలిక సదుపాయాలు మరిచారు నిర్మాణాలు చేపట్టలేదని స్థలాలు లాక్కుంటారు సిపిఐ మండల కార్యదర్శి గౌస్ పీరు

**కనేకల్లు జనవరి 27 ప్రభాతవార్త**



వామపక్షాలు ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కనేకల్ పట్టణం నందు వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ సర్కిల్ నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు ఇంటి స్థలాలు లబ్ధిదారులతో ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి గౌస్ పీరు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇంటి స్థలాలు లేని నిరుపేదలకు టౌన్ సర్వే నంబర్ 40.41లో అప్పటి తాసిల్దార్ ఇంటి స్థలం లేనిప్రతి పేదవానికి ప్రభుత్వం నుండి రెండు సెంట్లు స్థలము మరి ప్రభుత్వం నుండి పట్టాలు మంజూరు చేయడం జరిగింది అన్నారు. అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది కానీ ఆ లేవుట్లలో మౌలిక వసతులు అంటే నీరు కరెంటు రోడ్లు ఇలాంటి సౌకర్యం కల్పించకుండా ఆ ప్రభుత్వం కనుమరుగయ్యింది అన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పుడు ఆ ప్రభుత్వం కూడా మౌలిక వసతులు కల్పించలేదు ఆ ప్రభుత్వం కూడా కనుమరుగైన అయింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జగన్మోహన్ రెడ్డి అధికారంలో వచ్చిన తర్వాత ఆయన ప్రతిపక్షంలో ఇచ్చిన హామీ మన రాష్ట్రంలో ఏ ఒక్కరు కూడా ఇంటి స్థలము మరి ఇల్లు నిర్మాణం లేదని ఉండకూడదు అని చెప్పినా జగన్మోహన్ రెడ్డి అధికారంలో చేపట్టగా గత ప్రభుత్వం ఇచ్చిన లేవుట్ల పైన అధికారులను ఉసగొలిపి ఆ లేవుట్లలో అధికారుల ద్వారా ఎంక్వయిరీ చేయించి అక్రమంగా ఆ లేవుట్లకు అధికారికంగా ఇచ్చిన పట్టాలను రద్దు అయిపోయాయని అధికారుల ద్వారా చెప్పించి పేదలకు భయాందోళనకు గురి చేసి వారికి ఇచ్చిన ఇంటి స్థలాలు లాక్కొని ఆయన ఇచ్చిన హామీని జగన్ కాలనీ పేరు పెట్టి వారు అనుచరులకు ఆ స్థలాలు కట్టి పెట్టడం జరిగింది అన్నారు. అప్పట్లో వామపక్షాల ఆధ్వర్యంలో 41 సర్వే నంబర్లకు హైకోర్టు ద్వారా స్టే తెచ్చుకోవడం జరిగింది ఆ లేవుట్లో 90 శాతం నిర్మాణాలు పూర్తి అయిపోయాయి మిగతా 10శాతం ఖాళీగా ఉన్నాయి అవి కూడా నిర్మాణాలు చేపడుతుంటే స్థానిక రెవిన్యూ అధికారులను ప్రస్తుత ప్రభుత్వం టిడిపి ఇచ్చిన హామీని గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణంలో రెండు సెంట్లు ఇచ్చే కార్యక్రమం శ్రీకారం చుట్టగా మల్ల ఈ ప్రభుత్వం ఎక్కడ కూడా ఇంటి స్థలాలు కోసం భూమి కొనుగోలు చేయకుండా అరకొర మిగిలి ఉన్న ఆ భూమిని అధికారుల ద్వారా లాక్కునే కార్యక్రమం చేస్తున్నారు ఆ లేవుట్లలో అధికారికంగా దౌర్జన్యంగా అక్రమంగా బోర్డులు నాటడం చాలా బాధాకరం కాబట్టి ఈ ప్రభుత్వానికి వామపక్షాల నుండి గట్టిగా హెచ్చరిస్తున్నాం గతంలో ఇచ్చిన స్థలాలు జోలికి రాకుండా మీరు ఇచ్చిన హామీని ఇంటి స్థలాలు ఇవ్వాలంటే ప్రైవేట్ భూములు కొనుగోలు చేసి నిరుపేదలకు మూడు సెంట్లు ప్రకారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం తాలూకా కార్యదర్శి నాగార్జున మండల కార్యదర్శ గౌస్ పీర్ బషీర్ అహ్మదు ఎం తిప్పేస్వామి హనుమేష్ అబిదాబి బండ్ల చిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించివాహనాలు నడపరాదు- ఎస్ఐ శివ

**బెలుగుప్ప, జనవరి 27 ప్రభాతవార్త**

మండలకేంద్రంలో స్థానిక బెలుగుప్ప పోలీస్‌స్టేషన్‌లో స్థానికులకు జిల్లాఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం రోజు రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా వాహన దారులకు రోడ్డు భద్రత గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలునడిపి తేకఠిన చర్యలు తీసుకుంటానని, ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి వాహనాలునడిపే తప్పుడుఅటు ఇటు చూసి నడపాలని, పెట్రోల్ బంకులలో పెట్రోల్ వేసుకునే సమయంలో కూడాహెల్మట్ ధరించాలన్నారు. ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ శివశంకర్‌నాయక్, పోలీసుసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివ

## వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

**కళ్యాణదుర్గంటౌన్, జనవరి 27, ప్రభాతవార్త**



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీవో రమేష్

కళ్యాణదుర్గం పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు వాహనదారులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా పోలీసులు, రవాణా శాఖ అధికారులు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేకుండా పెట్రోల్ కొట్టించుకోవడానికి పెట్రోల్ బంక్ కువస్తే పెట్రోల్‌వెయ్యకూడదని పెట్రోల్‌బంక్ యాజమాన్యలకు సూచించారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రమాదాలను అరికట్టడంలో కృషి చేయాలని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవిబాబు, పట్టణ సీఐ హరినాథ్, ఆర్టీవో రమేష్, ఆర్టీసీ డి ఎం రామచంద్ర పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ధ్వజారోహణం

### రెండవ రోజు వైభవంగా శ్రీ పట్టాభి రామస్వామి బ్రహ్మోత్సవాలు

**కళ్యాణదుర్గం టౌన్, జనవరి 27, ప్రభాతవార్త**



ఆలయంలో పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం పట్టణంలోని వెలసిన శ్రీ పట్టాభి రామ స్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగ రంగ వైభవంగా కొన సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు మంగళ వారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రామనామ స్మరణతో ఆలయం మారు మ్రోగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు అవినాష్ గారి ఆధ్వర్యంలో ఈ ధ్వజారోహణ మహోత్సవం ఘనంగా జరిగింది. అర్చకుల వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల రామనామ స్మరణల మధ్య ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఆవిష్కరించి, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. డీఎస్పీ రవిబాబు, పట్టణ సీఐ హరినాథ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈసందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. “శ్రీరామ చంద్రుని ఆశీస్సులతో పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ఈబ్రహ్మోత్సవాలను అందరూకలిసికట్టుగా జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు ఈ వేడుకలో రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ వై.పి. రమేష్, మున్సిపల్ చైర్మన్ తలారి గౌతమి సోమశేఖర్, మార్కెట్ యార్డ్ చైర్మన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ కోనంకి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

## బెలుగుప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా పాఠశాల వార్షికోత్సవం నిర్వహణ




వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

**బెలుగుప్ప, జనవరి 27 ప్రభాతవార్త**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈరోజు పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటప్రసాద్ మాట్లాడుతూ.. బెలుగుప్ప పాఠశాలలో చదివి అత్యుత్తమ స్థాయికి చేరిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకొని మీరు కూడా బాగా చదువుకుని భవిష్యత్తులో రాణించాలని విద్యార్థులకు సూచించారు. గుత్తి డివిజన్ ఉప విద్యాధికారి పాటిల్ మల్లారెడ్డిని ఉదహరించారు. పాఠశాల కమిటీ చైర్మన్ రుద్రన్న మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదివి గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. అంతేకాకుండా బెలుగుప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బెలుగుప్ప మండల విద్యాశాఖ అధికారి 1 గుత్తి డివైఇఒ, పాఠశాల పూర్వ విద్యార్థి పాటిల్ మల్లారెడ్డి గత సంవత్సరం నుండి తరగతిలో పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు, హాజరు శాతం ఎక్కువగా ఉన్న విద్యార్థినీ, విద్యార్థులకు మంచి ప్రవర్తన గల విద్యార్థులకు 6 నుంచి 10 వరకు సెక్షన్ల వారీగా ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారు. అందులో భాగంగా ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకూ సెక్షన్ల వారీగా ఎఫ్ఎ 3 పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 33 మంది విద్యార్థులకు, మంచి నడవడిక గల 30 మంది విద్యార్థులకు, ఆటల పోటీలలో పాల్గొన్న 30మంది విద్యార్థులకు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న పదిమంది విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటప్రసాద్, సీనియర్ ఉపాధ్యాయులు బి.సరిత, ఉపాధ్యాయుల చేతుల మీదుగాబహుమతులను ప్రదానం చేయడం జరిగినది. ఈరోజు సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ప్రోత్సాహక బహుమతులు అందించడం జరిగినది. ఈ కార్యక్రమానికి సహకారం అందిస్తున్న మల్లారెడ్డికి విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఫిబ్రవరి I నుండి రోడ్డు భద్రతపై కఠిన నిబంధనలు : ఎస్ఐ నాగ మధు



మాట్లాడుతున్న ఎస్ఐ నాగ మధు

**కనేకల్లు జనవరి 27 ప్రభాతవార్త**

ప్రజల రక్షణ ధ్యేయంగా ప్రమాదాలను అరికట్టేందుకు ప్రజల ప్రాణాలను కాపాడేందుకు రోడ్ సేఫ్టీ మిషన్ లో భాగంగా మంగళవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ నందు ప్రజలకు ఎస్ఐ నాగ మధు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పెట్రోల్ బంకు యజమానులను టూవీలర్ షోరూం యజమానులను ప్రజలనతో స్థానిక పోలీస్ స్టేషన్లో నిబంధనలను వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై నాగముదు మాట్లాడుతూ ఫిబ్రవరి ఒకటో తేదీ నుండి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారుడు పెట్రోల్ బంకుకు పెట్రోల్ కోసం వెళ్ళినప్పుడు కంపల్సరిగా ద్విచక్ర వాహనదారుడు కి హెల్మెట్ ఉంటేనే పెట్రోల్ వెయ్యాలని యాజమాన్యులకు సూచించారు. గత మూడు సంవత్సరాలలో హెల్మెట్ లేకుండా వేయి మందికి పైగా మరణించారని. అలాగే పదహైదు వందలకు పైగా గాయాల పాలయ్యారని 300 కుటుంబాలు దెబ్బతిన్నాయి వీధిన పడ్డాయి అన్నారు. వీటికన్నిటికీ కారణం వాహనదారుడు రోడ్డు నిబంధనలు పాటించకపోవడం కారణమన్నారు. రోడ్డు భద్రతపై ఎస్పీ నియమ నిబంధనలు కంపల్సరిగా పాటించాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఫోర్ వీలర్ వాహనదారుడు సీట్ బెల్ట్ కంపల్సరీగా పెట్టుకోవాలని. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనాలని ఫోర్ వీలర్ ని నడపరాదన్నారు. మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు అన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుండి కంపల్సరిగా వాహనదారులు తమ వాహనాలను నడిపే నడిపేటప్పుడు రోడ్డు భద్రత నిబంధనలు కంపల్సరిగా పాటించవలనని తెలిపారు. అలా నిబంధనలు కి వ్యతిరేకంగా ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై లేపాక్షి ఆలయంలో ప్రత్యేక సమావేశం

**లేపాక్షి, జనవరి 27 ప్రభాతవార్త**



మహాశివరాత్రి ఉత్సవాలపై సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి శ్రీవీరభద్ర స్వామి ఆలయంలో మంగళవారం ఆలయ ఈఓ నరసింహమూర్తి ఆధ్వర్యంలో మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ పెద్దలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామస్తులతో కలిపి ఓ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. అన్నదాన కమిటీ సభ్యులు రాంప్రసాద్, వెచ్చం రవీంద్రనాథ్ మాట్లాడుతూ అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో శివరాత్రి ఉత్సవాల్లో ఐదు రోజులపాటు నిత్యాన్నదానం భారీ ఎత్తున నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా కీలుగుర్రాలు, పూల పల్లకి ఉత్సవ ఏర్పాట్లకు కూడా అన్నదాన కమిటీ నిధులను వెచ్చిస్తుందన్నారు. అదేవిధంగా ఈఓ నరసింహమూర్తి మాట్లాడుతూ ఈ ఏడాది శివరాత్రి బ్రహ్మోత్సవాలు చైర్మన్ రామానందన్ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. తదుపరి సమావేశం త్వరలో నిర్వహిస్తామని ఆ సమావేశంలో పూర్తి ఏర్పాట్లపై సమీక్ష చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు ఆదినారాయణ, టిడిపి మండల కన్వీనర్ అభిలాష్, కొండూరు ప్రభాకర్, గోవిందు, డిష్ మంజు, తెలుగు యువత ఎన్‌బికె మూర్తి, సిరివరం అనిల్‌కుమార్, గంగిరెడ్డి, అంగడి అంజి, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేలా రాణించాలి - నాగప్రసాద్‌నాయుడు



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న దృశ్యం

**గుత్తి, జనవరి 27 ప్రభాతవార్త**

విద్యార్థులు తమ విద్యాభ్యాసం పూర్తి చేసుకుని ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగేలా రాణించాలని జెఎన్‌టియు యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ నాగప్రసాద్‌నాయుడు పేర్కొన్నారు. స్థానిక గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం కళాశాల వ్యవస్థాపకులు వికె సుధీర్‌రెడ్డి జయంతి వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులకు గేట్స్ హానర్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమిక్ పరీక్షల్లో 80 శాతం పైగా మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం కనిపించగా, తల్లిదండ్రుల్లో ఆనందం కాన వచ్చింది. తమ కృషికి ఈ విధంగా గుర్తింపు ఇవ్వడం తమను మరింత ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు ప్రోత్సాహంగా ఉందని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎండి రఘునాథ్‌రెడ్డి, కరస్పాండెంట్ వికె పద్మావతి, డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపల్ డాక్టర్ నమ్రత, ఏఒ ఇంతియాజ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి మాఫియా వైసీపీకే చెల్లు

- టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి ఫైర్
- రైతులకు ఉచితంగా మట్టి ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యం
- అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తోలితే కఠిన చర్యలే
- మట్టిని పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారన్న సోషల్ మీడియా వదంతులపై టిడిపి నేతలు రియాక్షన్



సమావేశంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్

**గోరంట్ల, జనవరి 27 ప్రభాతవార్త**

ఇసుకను, మట్టిని పక్క రాష్ట్రాలకు తరలించి అక్రమ సంపాదన చేసిన ఘనత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు చెల్లుబాటు అవుతుందని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అవినీతికి తావు లేకుండా పాలన సాగిస్తోందని తెలుగుదేశం పార్టీ గోరంట్ల మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి వైసీపీ శ్రేణులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గోరంట్ల మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం పాత్రికేయుల సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, హస్తకళల స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్‌లు సోషల్ మీడియాలో జరుగుతున్న ఆసత్య ప్రచారాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రైతులు తమ పొలాలకు చెరువుల నుంచి మట్టిని ఉచితంగా తరలించుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే ఒక జీవోను జారీ చేసిందని గుర్తు చేశారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై స్పందించి అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా మట్టి తోలితే కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని ఆయన పేర్కొన్నారు. సోషల్ మీడియాలో కూటమి ప్రభుత్వం పైన గాని మంత్రి సవితమ్మ పైన గాని అసత్య ఆరోపణలు సోషల్ మీడియాలో విష ప్రచారం చేస్తే ఊరుకోబోమని తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఎవరు మట్టి తోలినా కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు సూచించినట్లు కన్వీనర్ బాలకృష్ణచౌదరి తెలిపారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల మేజర్ పంచాయతీ సర్పంచు సరోజ నాగేనాయక్, టిడిపి సీనియర్ నాయకులు నిమ్మల శ్రీధర్, జనసేన జిల్లా కార్యదర్శి సురేష్, గిరిధర్‌గౌడ్, మేకల జయరాం, సింగిల్ విండో డైరెక్టర్ నబిరసూల్, తదితరులు పాల్గొన్నారు.

## రుద్రరాజుకు....విమానాశ్రయంలో ఘన స్వాగతం

### - ఆహ్వానించిన పెనుకొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ నరసింహులు



ఎయిర్‌పోర్ట్‌లో రుద్రరాజును సన్మానిస్తున్న దృశ్యం

**గోరంట్ల, జనవరి 27 ప్రభాతవార్త**

నీలకంఠాపురం నుంచి హిందూపురానికి ప్రారంభం కానున్న మహాత్మాగాంధీ సందేశ్ యాత్రను మాజీ మంత్రి రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబోతున్నారు. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసిన ఏఐసిసి జనరల్ సెక్రటరీ పిసిసి మాజీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజుకు బెంగళూరు విమానాశ్రయంలో పెనుకొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ నరసింహులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సోమందేపల్లి మండల కన్వీనర్ గంగాధర్ పాల్గొన్నారు.

## గవిమఠం సహాయ కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన జి.మల్లికార్జున ప్రసాద్

### - ఎట్టకేలకు జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో బాధ్యతల స్వీకారం

**ఉరవకొండ, జనవరి 27 ప్రభాతవార్త**



గవిమఠం సహాయ కమీషనర్‌గా బాధ్యతలు చేపడుతున్న జి.మల్లికార్జున ప్రసాద్



నూతన సహాయ కమీషనర్ జి.మల్లికార్జున ప్రసాద్‌ను సన్మానించిన దృశ్యం

గవిమఠ సంస్థానం దేవాదాయ ధర్మాదాయశాఖ సహాయ కమీషనర్, మేనేజర్‌గా ఆశాఖ జిల్లా సహాయ కమీషనర్ జి.మల్లికార్జున ప్రసాద్ మంగళవారం సాయంత్రం పూర్తీ అదనపు బాధ్యతలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఆయన ప్రస్తుత సహాయ కమీషనర్ కె.రాణి నుండి బాధ్యతలు చేపట్టారు. ఈనెల 23వ తేదీన స్థానిక ఆయన గవిమఠంలోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టడానికి రాగా తాను ఇక్కడే కొనసాగాలనుకొంటున్నానని తనకు సమయం కావాలని ప్రస్తుత సహాయ కమీషనర్ ఆయనకు బాధ్యతలు అప్పగించి రిలీవ్ కావడానికి నిరాకరించగా ఆయన వెనుదిరిగిన విషయం తెలిసిందే. గడిచిన మూడు రోజుల్లో అనేక పరిణామాల అనంతరం జి.మల్లికార్జున ప్రసాద్ బాధ్యతలు చేపట్టడం విశేషం. నూతన సహాయ కమీషనర్ జి.మల్లికార్జున ప్రసాద్‌ను గవిమఠం పూర్వ ఏసీ, సిబ్బంది శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## పీఏబీఆర్ కుడికాలువపై క్షేత్రస్థాయి పర్యవేక్షణ

### రైతుబాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే ఆలోచనతో మంత్రి పనిచేస్తున్నారు. రైతులపొలానికి నీరు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

**ధర్మవరంటౌన్, జనవరి 27 ప్రభాతవార్త**



పీఏబీఆర్ కుడికాలువను పర్యవేక్షిస్తున్న బీజేపీనేత హరీశ్ బాబు

రైతుల సాగునీటి అవసరాలు ఎలాంటి అంతరాయంలేకుండా నెరవేరాలన్న సంకల్పంతో రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నిరంతరం ప్రత్యేకదృష్టి సారిస్తూ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారని బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ హరీశ్ బాబు తెలిపారు.మంత్రి సత్యకుమార్ ఆదేశాల మేరకు మంగళవారం హరీశ్ బాబు గొల్లపల్లి వద్ద ఉన్న పీఏబీఆర్ కుడికాలువను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా నీటి ప్రవాహ పరిస్థితి, కాలువ సామర్థం, గండ్లు పడే అవకాశం ఉన్నప్రాంతాలు, నీటివృథా, అక్రమంగా నీటి చౌర్యం జరిగే ప్రమాదాలపై స్వయంగా పర్యవేక్షించారు.అనంతరం అనంతపురంలో హెచ్ఎల్సీ నీటి పారుదలశాఖ ఎస్ఈ సుధాకర్, ఈఈ వెంకటేశ్వర్లు తదితర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాబోవు సాగుసీజన్ కు అవసరమైన నీరు అందుబాటు, పంపిణీ విదానం, కాలువ నిర్వహణ, భద్రత, గస్తీ ఏర్పాటు వంటిఅంశాలపై సమగ్రంగా చర్చించారు.పీఏబీఆర్ కుడికాలువ ద్వారా ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి మండలాలలోని చెరువులకు నీరు అందించే ప్రక్రియను ప్రణాళిక బద్ధంగా, పారదర్శకంగా అమలు చేయాల్సిన అసవరం ఉందన్నారు. రైతులకు చివరి ఎకరం వరకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని మంత్రిసత్యకుమార్ అధికారులను ఆదేశించినట్టు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు రాధాకృష్ణ, గంగాదర్ బాబు,అరుణశివ, శంకరప్ప, బీజేపీ నాయకులు పోతుకుంటరాజు, ఆకులేటి వీరనారప్ప, వెంకటేశ్ చౌదరిలు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవా అవార్డు అందుకున్న ఏడీఏ ఆఫీస్ సబార్డినేట్ బి.ఎన్.సురేష్

### - జిల్లా కలెక్టర్ సి.విష్ణుచరణ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం

**ఉరవకొండ, జనవరి 27 ప్రభాతవార్త**



జిల్లా కలెక్టర్ సి.విష్ణుచరణ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకొంటున్న ఆఫీస్ సబార్డినేట్ బి.ఎన్.సురేష్

ఉరవకొండ పట్టణంలోని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న బి.ఎన్.సురేష్ ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. జిల్లా కేంద్రం అనంతపురంలోని పోలీస్ పరేడ్ మైదానంలో సోమవారం జరిగిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన జిల్లా కలెక్టర్ సి.విష్ణుచరణ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను జిల్లా వ్యవసాయాధికారి యం.రవి, ఉరవకొండ ఏడీఏ ఎస్.సత్యనారాయణ సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా బి.ఎన్.సురేష్ మాట్లాడుతూ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

## ఉత్తమ సేవా అవార్డు అందుకున్న ఏడిఈ నాగేంద్ర

**గుంతకల్లు, జనవరి 27 ప్రభాతవార్త**



ఉత్తమ సేవా అవార్డు అందుకుంటున్న ఏడిఈ నాగేంద్ర

విద్యుత్ శాఖ ఏడిఈ నాగేంద్రకు ఉత్తమ సేవా అవార్డు లభించింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ శాఖ సూపరింటెండెంట్ శేషాద్రిశేఖర్ చేతుల మీదుగా ఏడిఈ నాగేంద్ర అవార్డు అందుకున్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో ఆయన కృషి చేశారు. గ్రౌండ్ లెవెల్‌లో సమస్యలను గుర్తిస్తూ ఉన్నతాధికారుల సహకారంతో వాటిని పరిష్కరించారు. ప్రధానంగా ఓవర్ లోడ్ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, లాంగ్ సర్వీసులు ఉన్నచోట ఇంటర్మీడియట్ ఫోల్స్ ఏర్పాటు, తదితర సమస్యలను పరిష్కరించడంలో ఏడిఈ పాత్ర ప్రధానమనే చెప్పాలి. దీంతో గుర్తించిన జిల్లా స్థాయి అధికారులు ఆయనకు ఉత్తమ సేవా అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

## నలుగురు పేకాట రాయుళ్ల అరెస్టు రూ.6200 నగదు స్వాధీనం

**ధర్మవరంటౌన్,జనవరి 27 ప్రభాతవార్త**

పట్టణంలోని శివానగర్ నాగులకట్టవద్ద పేకాట ఆడుతున్ననలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్దనుంచి రూ.6200 నగదును స్వాధీనం చేసినట్టు వన్ టౌన్ ఎస్ఐ ఉమాదేవి తెలిపారు. ఎస్పీ సతీశకుమార్, డీఎస్పీ హేమంత్ కుమార్, సీఐ నాగేంద్రప్రసాద్ లకు రాబడిన సమాచారం మేరకు తాను సిబ్బందితో శివానగర్ కు వెళ్లి నాగులకట్ట వద్ద పేకట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుంచి రూ.6200 నగదు.52 పేక ముక్కలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

## వారసత్వ సంపదను పరిరక్షించుకుందాం

అనంతపురం సప్తగిరిసర్కిల్ జనవరి 27 ప్రభాతవార్త

ఇంటాక్ 42వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం నగరంలోని స్థానిక నెహ్రూ మున్సిపల్ స్కూల్ నందు ఘనంగా నిర్వహించారు ఇంటాక్ సభ్యులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి నెహ్రూ స్కూల్ ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ నాగరికత పరిణామ క్రమంలో సంక్రమించిన వారసత్వ సంపదను పరిరక్షించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు విద్యార్థులు వారసత్వ సంపద గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు స్థానికంగా ఉన్న వారసత్వ కట్టడాలు కళలు సంస్కృతి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి వాటి పరిరక్షణ దిశగా చైతన్య వంతం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు వారసత్వ సంపద పరిరక్షణ ఆవశ్యకతను గుర్తించిన నాటి ప్రధాని రాజీవ్ గాంధీ చేతులమీదుగా 1984లో ఇంటాక్ సంస్థ ఆవిర్భవించిందన్నారు నాటి నుండి నేటివరకూ దేశవ్యాప్తంగా వారసత్వ సంపద పరిరక్షణ కోసం ఇంటాక్ సంస్థ శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నదని తెలిపారు ఈ కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు తోట నాగరాజు గుంటి మురళీకృష్ణ టి వి రెడ్డి జి అశ్వర్థరెడ్డి డా.జూటూరు షరీఫ్, షేక్ రియాజుద్దీన్ డా.గిరిధర్ రాయ్ సాదు శేఖర్ ఉపాధ్యాయులు కృష్ణవేణి హేమలత రామకృష్ణ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో వైస్సార్సీపీ శక్తి ప్రదర్శన..సంస్థాగత నిర్మాణానికి బైక్ ర్యాలీతో కదిలిన పార్టీ శ్రేణులు



బైక్ ర్యాలీతో బయలుదేరిన కల్లూరు వైస్సార్సీపీ శ్రేణులు

గార్లదిన్నె, జనవరి 27, ప్రభాతవార్త:

శింగనమల నియోజకవర్గంలో పార్టీని గ్రామ-వార్డు స్థాయిల్లో పునాదుల నుంచే బలోపేతం చేయాలనే లక్ష్యం తో నిర్వహిం చిన సంస్థాగత నిర్మాణ సమావేశా నికి వైస్సార్సీపీ శ్రేణులు ఉ త్సా హంగా కదిలాయి. గార్లదిన్నె మండల కేంద్రంలోని మార్తాడు క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన సభకు కల్లూరు నుంచి వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీతో బయలుదేరారు.పార్టీ జెండాలు ఎగురవేస్తూ, నినాదాలతో ముందుకు సాగిన ర్యాలీ నియోజకవర్గ రాజకీయాల్లో వేడి పుట్టించింది. గ్రామ, వార్డు కమిటీల నిర్మాణంలో కార్యకర్తలే కీలకమని చాటుతూ పార్టీ శ్రేణులు తమ సత్తా చాటాయి. ఈ బైక్ ర్యాలీ పార్టీ ఐక్యతకు, క్షేత్రస్థాయి బలానికి ప్రతీకగా నిలిచిందని నాయకులు వ్యాఖ్యానించారు. సంస్థాగత నిర్మాణ కార్యక్రమం పార్టీకి కొత్త ఊపిరి పోసిందని, రానున్న రాజకీయ సమరానికి ఇదే ఆరంభమని కార్యకర్తలు స్పష్టం చేశారు.

## .గ్రామ-వార్డు కమిటీల బలోపేతమే లక్ష్యం

### శింగనమల నియోజకవర్గ స్థాయి పార్టీ సంస్థాగత నిర్మాణ సమావేశంలో డా. శైలజనాథ్..



సమావేశంలో మాట్లాడుతున్న డా. శైలజనాథ్

గార్లదిన్నె, జనవరి 27,ప్రభాత వార్త: శింగనమల నియోజకవర్గంలోని గార్లదిన్నె మండలపరిధిలో మార్తాడు రోడ్డు టికన్వెన్షన్ నందు పార్టీని గ్రామ, వార్డు స్థాయిల్లో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా నియోజకవర్గ స్థాయి సంస్థాగత నిర్మాణ కార్యక్రమ సమావేశం ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశంలో వైస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ శైలజనాథ్, తాడిపత్రి సమన్వయకర్త పెద్దారెడ్డి, ఉరవకొండ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి, అనంతపురం పార్లమెంట్ అధ్యక్షులు నరేష్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా డాక్టర్ శైలజనాథ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి గ్రామ, వార్డు కమిటీలే పునాదని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో పనిచేసి ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.ఈ సమావేశంలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ కొండమీదరాయుడు సింహవాహనం పై దర్శనం



సింహవాహనం పై ఊరేగుతున్న శ్రీ కొండమీద రాయుడు

బుక్కరాయసముద్రం జనవరి 27 ప్రభాతవార్త

శ్రీ కొండమీదవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవం రెండవరోజున శ్రీ కొండమీదరా యుడు సింహవాహనం పై బుక్కరాయసముద్రం మం డల కేంద్రంలో ఊరేగుతూ భక్తులకు దర్శన మిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి కాయకర్పూరం అందజేసి కోర్కెలు తీర్చుకున్నారు.నేడు స్వామివారు శేషవాహనం పై దర్శనం ఇవ్వనున్నారు.ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇఒ రమేష్‌బాబు,ధర్మకర్త నారా యణస్వామి,ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నా రు. నేడు శేషవాహనం పై భక్తులకు దర్శనమిస్తారు.

## రోడ్డు భద్రతా నిబంధనలు తప్పక పాటించాలి ఎస్ఐ గౌతమ్

ఆత్మకూరు, జనవరి 27 ప్రభాతవార్త

రహదారి భద్రతా నిబంధనలను వాహనాదారులు తప్పనిసరిగా పాటించాలని ఆత్మకూరు ఎస్ఐ గౌతమ్ సూచించారు.రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎస్ఐ గౌతమ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వాహనదారులు,ఉపాధ్యాయులు,పెట్రోల్ బంక్ యజమానులకు,స్థానిక ప్రజలతో భద్రతా వారోత్సవాల్లో పాటించాల్సిన నిబంధలను వివరించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఈ నెల 31వ తేది వరకు భద్రత వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 1వ తేది నుంచి ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు.ద్విచక్ర వాహనదారులు పెట్రోల్ బంకుకు పెట్రోల్ కోసం వచ్చినప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ఉంటేనే పెట్రోల్ వెయ్యాలని పెట్రోల్ బంకు యజమానులకు సూచించారు.రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకపోవడంతో అనేక మంది మరణించారని,అలాగే చాలా మంది వికలాంగుల మారారని పేర్కొన్నారు.ఫోర్ వీలర్ వాహన దారులు సీట్‌బెల్ట్,డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలును నడిపితే కఠిన చర్యలు తప్పవని,రోడ్డు భద్రత నిబంధనలుకి వ్యతిరేకంగా ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.అనంతరం భద్రత వారోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లును విడదల చేశారు.ఈ కార్యక్రమంలో వాహనదారులు,ఉపాధ్యాయులు.తదితరులు పాల్గొన్నారు.



భద్రత నియమాలుపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గౌతమ్

## ఉప రవాణాకమిషనర్ జిల్లాలో వాహన డీలర్లతో ఒక సమావేశం

అనంతపురం న్యూటౌన్, జనవరి 27 ప్రభాతవార్త

జీవిత కాల పన్ను చెల్లించే వాహనాలపై 13.01.26 నుండి జీవిత కాల పన్ను పై 10 రోడ్ సేఫ్టీ సెస్‌ను వసూలు చేయాలని, 01.01.26 నుండి అన్ని ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు వెహికల్ లోకేషన్ ట్రాకింగ్ డివైస్ అమరిక గూర్చి ఉప రవాణా కమిషనర్ ఎం వీర్రాజు వివరించడం జరిగింది. అదేవిధంగా వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పెండింగ్ వివరాలను రివ్యూ చేయడమైనది. ముఖ్యంగా వాహన రిజిస్ట్రేషన్ సమయంలో రవాణా శాఖ సిబ్బంది పేరిట అదనపు వసూళ్లు చేస్తే ఆయా డీలర్ల యొక్క లైసెన్సులను సస్పెండ్ చేయడం జరుగుతుందని తెలియజేసారు. ఎవరైనా వాహన డీలర్లు, రవాణా శాఖ సిబ్బంది పేరిట అదనపు వసూళ్లు చేస్తే 085542 44383 నెంబర్ కు ఫోన్ చేసి, తగిన ఆధారాలతో నేరుగా ఫిర్యాదు చేయవచ్చని ఉప రవాణా కమిషనర్ ఈ ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలోని అన్ని వాహన షో రూమ్ లలో పైన తెలిపిన నంబర్ వాహన కొనుగోలుదారులకు స్పష్టంగా కనబడేట్లు ఉంచాలని కోరడమైనది. ఈ సమావేశంలో ఆర్టీవో సురేష్ నాయుడు, రవాణా శాఖ సిబ్బంది, జిల్లాలోని అందరు వాహన డీలర్లు పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

## ఉత్తమ అవార్డు అందుకున్న మహీధర్



అవార్డు అందుకుంటున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జనవరి 27 ప్రభాతవార్త

రిపబ్లిక్ డే సందర్భంగా కళారంగంలో చేసిన సేవల కుగాను అనంతపురానికి చెందిన కె.వి.మహీధర్ కలెక్టర్ నుండి ఉత్తమ ప్రతిభా అవార్డు అందుకున్నారు. విశ్రాంత బ్యాంకు ఉద్యోగి అయిన మహీధర్ గారు జిల్లాలో ప్రముఖ గాయకులు. మహతి లలిత సంగీత పాఠిటఖిశాల నిర్వహి స్తూ ఎంతో మంది ఔత్సాహిక గాయనీ, గాయకులకు తర్ఫీదు ఇస్తున్నారు. భువన విజయం లో పింగళి సూరన గా దాదాపు వంద ప్రదర్శనల లో నటించారు. తెలుగు భాషా వికాస ఉద్యమ గాయకుడుగా భాషాభివృద్ధికి తోడ్పడుతున్నారు. ఎన్నో భక్తి ఆల్బమ్స్ రూపొందించి ప్రముఖులచే మన్ననలందుకున్నారు. ఈ అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## ప్రతి ఒక్క యువత ఓటు ఓటు విలువను తెలుసుకోవాలి

### - మై భారత్ ఆధ్వర్యంలో మై భారత్ మై ఓటు పాదయాత్ర నిర్వహణ

అనంతపురం న్యూటౌన్, జనవరి 27 ప్రభాతవార్త




ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, మై భారత్, మరియు జే ఎన్టియు ఓ.టీ.పీ.ఆర్.ఐ కళాశాల ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవ వారోత్సవాలలో భాగంగా, మై భారత్ మై ఓటు పాదయాత్ర ర్యాలీని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డా.జి.మమత, కళాశాల డైరెక్టర్ డా. జి.వి.సుబ్బారెడ్డి, ఐక్యరాజ్య సమితి యూత్ కో ఆర్డినేటర్ బిసాతి భరత్, ప్రిన్సిపాల్ సి.గోపినాథ్, మై భారత్ ప్రోగ్రాం ఇంచార్జ్ జి.శ్రీనివాసులు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ సుంకర రమేష్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి జీవన్ కుమార్, కె.జయమారుతి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్ లహరి పాల్గొన్నారు.

## 30న స్పోర్ట్స్ సమావేశానికి ఎమ్మెల్యే రాక

బుక్కరాయసముద్రం జనవరి 27 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మండల పరిదిలోని జంతులూరు గ్రామ సమీపంలో ఉన్న 14వ పోలీస్ బెటాలియన్ నందు 4వ అన్యూవల్ స్పోర్ట్స్ ముగింపు సమావేశం ఈ నెల 30న శింగనమల నియోజకవర్గం ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ ముఖ్యఅథితులుగా రావడం జరుగుతుందని పోలీసు బెటాలియన్ సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దయ్య ఒక ప్రకటనలో తెలిపారు.4వ అన్యూవల్ స్పోర్ట్స్ సందర్భంగా పోలీసులకు ఆటలపోటీలు నిర్వహించడం జరుగుతుంది,ఇందులో గెలుపొందినవారికి ప్రథమ,ద్వితియ,తృతియ బహుమతులు అందజేడయం సరుగుతందన్నారు.

## పేరూరు డ్యాంలో పశువైద్య శిభిరం



పశువులకు వైద్యం చేస్తున్న అధికారులు, సిబ్బంది

రామగిరి, జనవరి 27 ప్రభాతవార్త

పేరూరు డ్యాంలో పశు ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం పశుఆరోగ్య శిభిరాన్ని నిర్వహించారు. డాక్టర్ సునీత ఆధ్వర్యంలో ఈ పశు ఆరోగ్య కేంద్రాన్ని నిర్వహించి రైతులకు పశువర్ధక శాఖ సంబంధించిన వివిధ పథకాలపై అవగాహన కల్పించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పశుఆరోగ్యశిబిరంలో ఆవులు, గేదెలు, గొర్రెలు, దూడలు, కోళ్లకు నట్టల నివారణ మందులు ఇచ్చారు. అలాగే ఆవులు ,గేదెలలో గర్భకోశకు సంబంధించిన సమస్యలకు వైద్య చికిత్సలు చేశారు. పశువులలో కృత్రిమ గర్భదారణ, మేలుజాతి దూడల పెంపుపై తెలియజేశారు. ఈ సందర్భంగా పశు ఆరోగ్య శిబిరాలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది నరేష్, జ్యోతి, మనోహర్, గోపాల మిత్ర పోతన్న తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకి ఘనసన్మానం



సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జనవరి 27 ప్రభాతవార్త

77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసా పత్రం అందుకున్న హెచ్ రామాంజనమ్మ జూనియర్ అసిస్టెంట్, జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యాలయం అనంతపురం వారిని అధ్యక్షులు వడ్డే వెంకట్ అభినందనలు తెలుపుతూ చాలువాతో సత్కరించినారు.

## ఉత్తమ జిల్లా అధికారిగా జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్



అవార్డు అందుకుంటున్న జిల్లా రిజిస్ట్రర్ భార్గవ్

అనంతపురం న్యూటౌన్, జనవరి 27 ప్రభాతవార్త

ఈనెల 26వ తేదీ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పెరేడ్ గ్రౌండ్ లో సోమవారము జిల్లాస్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో ఉత్తమ అధికారులు, ఉద్యోగులకు అవార్డులను అందజేశారు. అందు లో భాగంగా మొత్తము జిల్లా అధికారిగా ఎంపికైన అనంతపురం జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్టర్ జి.భార్గవ్ ఇన్చార్జి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా రిజిస్టర్ కు డీఐజీ విజయలక్ష్మి, పలువురు సబ్ రిజిస్టర్లు, ఉద్యోగులు, ఇతర శాఖ అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ అవార్డు తనకు మరింత బాధ్యతను పెంచిందని, ఇదే స్ఫూర్తితోనే ముున్ముందు కూడా పనిచేస్తానని జిల్లా రిజిస్టర్ జి.భార్గవ్ తెలిపారు.

## రేపటి నుంచి నిర్వహించే 'లింగాయత్' వాణిజ్య సదస్సుకు తరలిరండి



'లింగాయత్' సమావేశానికి హాజరైన నాయకులు

అనంతపురం జనవరి27 ప్రభాతవార్త

బెంగుళూరు నగరంలోని వైట్ పెటల్స్ ప్యాలెస్ గ్రౌండ్‌లో ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 1వరకు నిర్వహించే ఇంటర్నేషల్ లింగాయత్ యూత్ ఫోరం (ఐఎల్‌వైఎఫ్) ఆధ్వర్యంలో అంతర్జాతీయ వీరశైవ సమాజ వాణిజ్య సదస్సుకు విద్యావంతులు, వ్యాపారవేత్తలు, మేధావులు, రాజకీయ ప్రముఖులు విరివిగా హాజరుకావాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక హెచ్‌ఎల్‌సి కాలనీలోని ఆ సంఘం కార్యాలయలో నిర్వహించిన సమావేశంలో ఎపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా వీరశైవ జంగమ సంక్షేమ జిల్లా సలహాదారులు ఎం.పి. ఈశ్వర్ ప్రసాద్, జిల్లా అధ్యక్షులు మఠం తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు బ్రహ్మశంకర్, సభ్యులు శివానంద, నటరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. నాలుగురోజులు పాటు నిర్వహించే ఈ సదస్సును కర్ణాటక మం త్రులు ఎం.బి.పాటిల్, ఈశ్వర్ ఖండ్రే, శాసనమండలి చైర్మన్ బసవరాజు హోరెట్టి, కేంద్రమంత్రి ప్రహ్లాద జోషి, విఆర్‌ఎల్ సంస్థ అధినేత విజయసంకేశ్వర్, ఎల్ఈ సొసైటీ విద్యావేత్త, వ్యాపారవేత్త ప్రభార్ కోరే తదితరులు ప్రారంభిస్తారన్నారు.

## 'అనారోగ్య' బారీన పడ్డ కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం జనవరి27 ప్రభాతవార్త

అనారోగ్యం భారీన పడి విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు వారి కుటుంబాల్లో ఉద్యోగ అవకాశం కల్పించాలని ఎస్సీ మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామికి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్‌బాబు, నాయకులు డాక్టర్ తిరుపాల్, కె.ఆర్.సురేష్, ఎం.ఓబులేసు, ఎస్.వెంకట నరసయ్య, రాఘవ, శశి, దేవా, లక్ష్మణ్, నరసింహులు, కుళ్లాయప్ప తదితరులు మాట్లాడుతూ రిటైర్‌మెంటు వయోపరిమితిని 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని, 2010 నుంచి 2021 వరకు సంబంధించిన పిఎఫ్ నిధులు అందలేదని, కార్మికులకు ఐడి కార్డులు, సర్వీసు సర్టిఫికెట్లు లేకపోవడం వల్ల రిటైర్‌మెంట్ సమయంలో గ్రాట్యుటీ , పెన్షన్ లాంటి సౌకర్యాలు కోల్పోతన్నారన్నారు. అదనపు కార్మికులకు ఈపిఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు వంటివి వాటిని తక్షణం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## వారానికి 2 రోజులు సెలవులు కోరుతూ బ్యాంకు ఉద్యోగులు నిరసన




నిరసన తెలుపుతున్న బ్యాంక్ ఉద్యోగులు.

బళ్లారి జనవరి 27 ప్రభాతవార్త:

బళ్లారి నగరంలో ఎస్బిఐ ప్రధాన బ్యాంక్ ఆవరణంలో 5 రోజులు పని, 2 రోజులు సెలవులు కోరుతూ మంగళవారం యునైటెడ్ ఫోరం ఆఫ్ యూనియన్స్ (గనీతీగీ) ద్వారా జాతీయ బ్యాంక్ ఉద్యోగులు నిరసన తెలిపారు. గత 10 సంవత్సరాలుగా తమ డిమాండ్‌ను నెరవేర్చనందుకు నగరంలోని శీతీ। బ్యాంక్ ప్రధాన కార్యాలయానికి భారీ నిరసనగా వచ్చిన ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు మరియు తమ డిమాండ్ నెరవేరే వరకు తమ పోరాటం ఆగదని అన్నారు. జాతీయం చేసిన బ్యాంకుల ప్రైవేటీకరణను ఆపాలని కూడా వారు అన్నారు. మేము అన్ని కేంద్ర ప్రభుత్వ పథకాలను పగలు మరియు రాత్రి అమలు చేస్తాము మరియు ప్రజలకు సేవలను అందిస్తాము. మా ఉద్యోగుల ఉద్యోగ భద్రతపై దృష్టి పెడతాము. మేము నిరంతరం ప్రజలకు సేవ చేస్తున్నప్పుడు మమ్మల్ని విస్మరిస్తున్నందున పోరాటం అనివార్యం అని అన్నారు.

## నేటి నుంచి ఒకేషనల్ విద్యార్థులకు పబ్లిక్ ప్రాక్టికల్స్

అనంతపురం న్యూటౌన్, జనవరి 27 ప్రభాతవార్త

జిల్లాలో నేటి నుండి ఇంటర్మీడియట్ ఒకేషనల్ విద్యార్థులకు పబ్లిక్ ప్రాక్టికల్ పరీక్షలు 10 పరీక్ష కేంద్రాలలో ఉదయం మొదటి సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం రెండవ సంవత్సరము విద్యార్థులకు ప్రారంభమైనవి. మంగళవారం జరిగిన పరీక్షలకు ఉదయం ఒకేషనల్ విద్యార్థులు 414 మందికిగాను 389 మంది హాజరు కావడం జరగగా, 25 మంది గైర్హాజర్ కావడం జరిగింది.

మధ్యాహ్నం 371 మంది విద్యార్థులకు గాను, 362 మంది హాజరు కావడం జరగగా, 9 మంది మంది గైర్హాజరు కావడం జరిగింది. కన్వీనర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి 02 పరీక్షా కేంద్రాలను, జిల్లా వృత్తి విద్యా శాఖాధికారి గురువయ్య చెట్టి 02 పరీక్షా కేంద్రాలను పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు నాగరత్న, కృష్ణమూర్తి, గురు ప్రసాద్ 4 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయడం జరిగిందని కన్వీనర్, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటి మరియు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి యం.వెంకటరమణ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసా పత్రం అందుకున్న శ్రీమతి హెచ్ రామాంజనమ్మ జూనియర్ అసిస్టెంట్ ,జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యాలయం అనంతపురం వారిని శ్రీయుత అధ్యక్షులు శ్రీ వడ్డే వెంకట్ గారుఅభినందనలు తెలుపుతూ చాలువాతో సత్కరించినారు.

